

ఉష్ణోగ్రత

నగరం	గరిష్ట	కనిష్ట:
రాజమహేంద్రవరం	41.5	28.0
కాకినాడ	36.8	27.4
అమలాపురం	39.7	26.0



సప్లిమెంటరీ కసరత్తులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

8లో

'నన్నయ' వీసీగా ఆచార్య పద్మరాజు



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతిగా కాకినాడ జేఎన్‌టీయూ ఈసీఈ విభాగంలో అధ్యాపకునిగా, అడ్మిషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య కె.పద్మరాజును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. మూడేళ్ల పాటు ఆయన వీసీగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా 'నన్నయ' వర్సిటీకి ఆచార్య పద్మరాజు 5వ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

న్యూస్‌రీల్

డీఎస్పీగా అంబికా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



అమలాపురం టౌన్: అమలాపురం కొత్త డీఎస్పీగా ఎం.అంబికా ప్రసాద్ స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాకినాడ జిల్లా ఎస్పీ డీఎస్పీగా పనిచేస్తూ రామచంద్రపురం డీఎస్పీగా బదిలీ అయిన కొద్ది రోజులకే అమలాపురం డీఎస్పీగా నియమితులైన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన వై.మాధవరెడ్డి కృష్ణా జిల్లా మచిలీపట్నం డీఎస్పీగా బదిలీ అయిన విషయమూ విదితమే. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ అంబికా ప్రసాద్ తొలుత జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను పోలీసు సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రౌడీయిజం, సైబర్ నేరాలు, సెటిల్‌మెంట్లు అనేవి లేకుండా చేసి పోలీసు సేవలను ప్రజలకు మరింత దగ్గర చేస్తానని అంబికా ప్రసాద్ అన్నారు. ప్రజలకు, వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని చెప్పారు.

30 నుంచి బాలాజీస్వామి కల్యాణోత్సవాలు



మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈఓ డి.శ్రీరామవరప్రసాదరావు బుధవారం తెలిపారు. స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవం 31వ తేదీ బుధవారం రాత్రి 9.15 గంటలకు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తాన జరుగుతుందన్నారు. 30వ తేదీ మంగళవారం జ్యేష్ఠ శుద్ధ దశమి ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేనారాధనతో కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన ఏర్పాటు చేశామన్నారు. 2వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామివారికి చక్ర స్నానం జరుగుతుందన్నారు. 3వ తేదీన ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, ఋత్విక్ సన్మానంతో స్వామివారి కల్యాణోత్సవాలు సంపూర్ణమవుతాయన్నారు. కల్యాణోత్సవాలు జరిగే అయిదు రోజులు పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్ రామకృష్ణ, ఈఓ ప్రసాదరావు చెప్పారు.

74,336.905 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

అమలపురం టౌన్: జిల్లాలో రబీ 2022–23 సీజన్‌లో అంచనా వేసిన వరి సేకరణ 2.80 లక్షల మెట్రిక్ టన్నులు కాగా బుధవారం నాటికి 9,711 మంది రైతుల నుంచి 82,521.440 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్లు అందజేశామని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో వెల్లడించారు. బుధవారం వరకూ జిల్లాలో 74,336.905 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన వారం రోజుల లోపే రూ.23.02 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాలకు జమ చేశామని తెలిపారు. మరో రూ.79.46 కోట్లు కూడా రైతుల ఖాతాలకు పంపించామని తెలిపారు. రైతులకు గోనె సంచుల వినియోగ చార్జీల కింద రూ.3.39, హమాలీ చార్జీగా రూ.22 చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై రైతుల ఫిర్యాదుల కోసం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 83094–32487లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర సూచించారు.

ప్రశాంతంగా పాలిసెట్

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19 కేంద్రాలలో పాలిసెట్ నిర్వహించామన్నారు. రామచంద్రపురంలో 6 కేంద్రాలు, ముక్తేశ్వరంలో రెండు కేంద్రాలు, అమలాపురంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. 5,224 మంది ఈ ప్రవేశ పరీక్ష రాసినట్టు స్పష్టం చేశారు.

లెక్క తేలుస్తున్నారు

- పంట నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు
- ప్రాథమిక నివేదికపై ప్రారంభమైన కసరత్తు
- ఈ నెల 15 వరకు క్షేత్ర స్థాయిలో అంచనాలు
- 16 నుంచి ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శన
- త్వరగా పరిహారం చెల్లింపునకు సన్నాహాలు



రామచంద్రపురం మండలం నెలపర్తిపాడులో తడిసిన పంట నష్టం అంచనాల తయారీలో అధికారులు

సాక్షిప్రతినిధి,కాకినాడ: ఏ సీజన్‌లో నష్టానికి ఆ సీజన్‌లో రైతులకు పరిహారం అందిస్తోన్న ప్రభుత్వం ఈ సారి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తోంది. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కసరత్తు చేస్తోంది. రబీలో ఇటీవల చేతికొచ్చిన కొంత పంట అకాల వర్షాలకు తడిసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యం వల్ల రైతులు నష్టపోకుండా నిబంధనలు సడలించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈసరికే పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా సేకరణ ప్రక్రియను అధికారులు దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్నారు.

ప్రాథమిక అంచనా

మరోవైపు వర్షాలతో జరిగిన పంట నష్టాల లెక్కలు తేల్చేందుకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వరి ఇతర పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించే ప్రక్రియకు బుధవారం శ్రీకారం చుట్టారు. పంట నష్టంపై ఇప్పటికే మండల స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ప్రాథమిక నివేదికను రూపొందించింది. గ్రామాలలో తడిసిన పంటల వివరాలను ఇందులో పొందుపరిచారు. వీటిని సాంకేతికంగా నిర్ధారించేందుకు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో మండల, గ్రామ స్థాయిలో బృందాలు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు క్షేత్ర స్థాయికి వెళుతోన్న ఈ బృందాలు ఆ నివేదికలను దగ్గర పెట్టుకుని పంటల వారీగా లోతుగా అంచనా తయారు చేస్తున్నారు. గత ఏప్రిల్ చివరి వారం, మే మొదటి వారంలో అకాల వర్షాలకు ఏమేరకు వాస్తవంగా నష్టం జరిగిందో బృందాలు లెక్కలేస్తున్నాయి. పంట నష్టం జరిగి ఉంటే సంబంధిత రైతు పేరు, అడంగల్ వంటివి నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. 33 శాతానికి మించి నష్టం జరిగిన పంటలనే నష్టపరిహారానికి ప్రామాణికంగా తీసుకోనున్నారు.

16 నుంచి జాబితాల ప్రదర్శన

గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో మూడేసి బృందాలు సంయుక్తంగా నష్టం అంచనాలు రూపొందించనున్నాయి. గ్రామ స్థాయిలో సర్పంచ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శులు ఒక బృందంగా ఏర్పడ్డారు. మండల స్థాయిలో మండల పరిషత్ అధ్యక్షులు, తహసిల్దార్, మండల వ్యవసాయాధికారి, మండల అభివృద్ధి అధికారి, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో బృందాలు ఏర్పడ్డాయి. బృందాలు తమకు అందిన ప్రాథమిక నష్టం నివేదికలతో ఈ నెల 15వ వరకు క్షేత్ర స్థాయిలో నష్టం అంచనాలను సరిచూస్తాయి. సరిచూశాక రైతుల వారీగా జరిగిన నష్టాన్ని లెక్కలేసి జాబితాలు రూపొందిస్తారు. పంట నష్టపోయినా జాబితాలో నమోదు కాలేదని రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు తెలుసుకుని పారదర్శకంగా ఉండేందుకు ఈ నెల 16 నుంచి 20 వరకు రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శిస్తారు. తుది జాబితాను ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ నెల 21న ప్రభుత్వానికి నివేదించనున్నారు.



పిఠాపురం మండలంలో పంట నష్టాన్ని అంచనా వేస్తోన్న వ్యవసాయాధికారులు

ఇవెక్కడి విమర్శలు

వాస్తవం తెలుసుకోకుండా.. నష్టం అంచనాలు రూపొందించకుండా రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు రాజకీయం చేయడంపై విజ్ఞులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పంటకు నష్టం జరిగితే క్షేత్ర స్థాయిలో అంచనాలు రూపొందిస్తాయని తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. తుది జాబితా తయారయ్యాక ప్రభుత్వానికి నివేదించడం, నష్టపోయిన రైతులకు మార్గదర్శకాలకు అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తారు.

- తూర్పుగోదావరి జిల్లాలో 11 మండలాల పరిధిలోని 65 గ్రామాల్లో ప్రాథమికంగా పంట తడిసిందని గుర్తించారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు అన్నీ కలిపి మొత్తంగా 1,200 హెక్టార్లలో పంట నీట మునిగింది. ఇందులో 1,100 హెక్టార్లలో వరికి నష్టం జరగగా, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిపై బృందాలు అంచనాలు రూపొందిస్తున్నాయి.
- కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లోని 10 మండలాల పరిధిలోని 127 గ్రామాల్లో వరి పంటకు నష్టం జరిగిందని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి.
- ఈ మండలాల్లో అకాల వర్షాలతో కాలువలు, డ్రైన్‌ల పక్కన ఉన్న 1,193 హెక్టార్లలో వరి తడిసిందని గుర్తించారు.
- ఈ పంటలో నష్టం ఏమేరకు ఉంటుందనేది ఈ బృందాలు అంచనా వేస్తున్నాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొమ్మిది మండలాల్లో వరి నీట మునిగిందని.. ధాన్యం తడిసిముద్దయ్యిందని ప్రాథమికంగా తేల్చారు.
- ఈ జిల్లాలోని 104 గ్రామాల్లోని 412 హెక్టార్లలో పంటకు నష్టం జరిగినట్టు గుర్తించారు. ఇలాంటి పంట పొలాలను సర్వే బృందాలు మరోసారి నిశితంగా పరిశీలించనున్నాయి.
- సాంకేతిక అవగాహనతో ఒక అంచనాతో జాబితాను రూపొందిస్తాయి.

ఈ విషయం సుదీర్ఘ కాలం సీఎంగా చేసిన చంద్రబాబుకు తెలియదా అని రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

ఇంత త్వరగా వస్తారనుకోలేదు



15 ఎకరాలు సాగు చేస్తున్నాను. వర్షాలతో కొంత పంట తడిసిపోయింది. తడిసినప్పటికీ అధికారులు వచ్చి పరిశీలిస్తారా లేదా అనే అనుమానపడ్డాం. అటువంటిది అకాల వర్షాలతో పంటలు తడిసిన ఇంత తక్కువ వ్యవధిలోనే అంచనాలు తయారు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం సంతోషం. ఇలా ఏ ప్రభుత్వం ఇంత త్వరగా పంట నష్టాలు తయారుచేయలేదు.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు,వరి రైతు, గాడిలంక

పరిహారం ఇస్తుందనే నమ్మకం



ప్రకృతి సహకరించడంతో పంట దిగుబడి బాగా వచ్చింది. గత నెల 28న వరి కోతలు పూర్తి చేశాను. ధాన్యం కళ్లాల్లోకి చేర్చి రైతు భరోసా కేంద్రాలకు తరలించి అమ్ముదామనుకునే సమయంలో అకాల వర్షాలకు పంట తడిసిపోయింది. ఈ సమయంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం నష్టం అంచనాలు తయారు చేయడానికి ముందుకు రావడంతో ధైర్యం కలిగింది.

– బిక్కిన సీతారామ్,చోదవరం, రామచంద్రపురం

అంచనాలు రూపొందిస్తున్నాం



అకాల వర్షాలతో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల, గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన బృందాలు క్షేత్ర స్థాయిలో అంచనాలు రూపొందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలతో తడిసినట్టు ప్రాథమికంగా గుర్తించిన పంట పొలాలను పరిశీలిస్తున్నాయి. నష్టం అంచనాలు తయారుచేసే ప్రక్రియ ప్రారంభించాం. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో ప్రతి పంట క్షేత్రం వద్దకు నేరుగా వెళుతున్నాయి.

– కాకి నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారి, కోనసీమ జిల్లా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అల్లవరం: ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలతో మానవ జీవన విధానానికి పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా అటవీ శాఖాధికారి ఎంవీ ప్రసాదు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ఓడలరేవు సముద్ర తీరంలో పర్యావరణ మాసోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓడలరేవు బీచ్‌లో నో ప్లాస్టిక్ విధానాన్ని పాటించారు. తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖాధికారి మాట్లాడుతూ మానవ జీవన విధానానికి ప్రతి ఒక్కరూ ఏడు సూత్రాలు పాటించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సిద్ధంగా వస్తున్న శక్తిని కాపాడాలి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పాలి, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలను తగ్గించాలి, బయోడిగ్రేడ్ వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేయాలి. ప్రజల ఆహార అలవాట్లు మార్చుకోవాలి, ఆరోగ్యాన్ని కాపాడే వ్యాయామాలు అలవాటు చేసుకోవాలన్నారు. జూన్ 5 వరకు జరిగే మాసోత్సవాల్లో పర్యావరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. అమలాపురం అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ హరికుమార్ పాల్గొన్నారు.



ఓడలరేవు సముద్ర తీరంలో పర్యావరణ పరిరక్షణపై ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న అటవీ శాఖాధికారులు

కళాశాలల పర్యవేక్షణకు కమిటీ

అమలాపురం టౌన్: ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒకేషనల్ కళాశాలల పర్యవేక్షణకు జీవో నంబరు 192 ప్రకారం జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ శుక్లా మాట్లాడారు. ఇంటర్ బోర్డు విధి విధానాలకు అనుగుణంగా కళాశాలలలు పని చేస్తున్నాయా...లేదా అనే అంశాలపై ఈ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. కమిటీకి అధ్యక్షుడిగా కలెక్టర్, ఉపాధ్యక్షుడిగా ఎస్పీ సుసరాపు శ్రీధర్, కన్వీనర్‌గా ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారి, సభ్యులుగా జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి, మున్సిపల్ కమిషనర్, జిల్లా అగ్నిమాపక దళాధికారి, డీఎస్పీలు వ్యవహరిస్తారని కలెక్టర్ శుక్లా పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 101 జూనియర్ ఒకేషనల్ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బోర్డు నియమ నిబంధనలు తప్పకుండా అనుసరించాలని ఆదేశించారు. కమిటీ పూర్తిగా పరిశీలించాకే వార్షిక అనుబంధ కొనసాగింపు అనుమతులు మంజూరు చేస్తుందనని కలెక్టర్ శుక్లా స్పష్టం చేశారు. కమిటీ ఉపాధ్యక్షుడు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో ఎస్‌వీఎల్ నరసింహం, కమిటీ సభ్యులు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవీఈవో) సత్యనారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఎస్.మధుసూదన్, అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రసంగించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎస్పీ శ్రీధర్, కమిటీ సభ్యులు

సాంకేతిక సౌలభ్యం

- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న జనం
- సేవల సులభతరానికి దోహదపడుతున్న వైనం
- నేడు జాతీయ టెక్నాలజీ డే



టేకి ఆర్బీకేలో కియోస్క్ యంత్రంతో విధుల నిర్వహణ

కపిలేశ్వరపురం: పల్లెల్లో సాంకేతిక విప్లవం నడుస్తోంది. అనుక్షణం మారిపోతున్న అవసరాలను తీర్చేందుకు సాంకేతికత ఉపయోగపడుతోంది. గత ప్రభుత్వానికి భిన్నంగా ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సాంకేతికతను చేరువ చేసింది. దీంతో పరిపాలన సులువవడమేకాక సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల ముంగిటకే వేగంగా చేరుతున్నాయి. గురువారం జాతీయ టెక్నాలజీ డే నేపథ్యంలో ఈ కథనం...

ప్రజలనూ, పాలకులనూ అనుసంధానిస్తూ..

ఇటీవల ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902 టోల్ ఫ్రీ నంబర్ బాధితుడిని నేరుగా సీఎం కార్యాలయానికి అనుసంధానం చేస్తుంది. జిల్లాలో 515 సచివాలయాల్లో 4,528 మంది ఉద్యోగులు, వేలాది మంది వలంటీర్లు పని చేస్తున్నారు. ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమం ద్వారా 2022 ఏప్రిల్ 4 నుంచి ఈ ఏడాది మే 7 వరకూ జిల్లాలో 14,414 అర్జీలను స్వీకరించారు. వాటిలో 12,586 పరిష్కరించారు. ప్రభుత్వం ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహిస్తోంది. జిల్లాలోని 60 కేంద్రాల్లో ఇప్పటి వరకూ 22,684 మంది తమ వివరాలను నవీకరించుకున్నారు.

విప్లవాత్మక మార్పులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. మారుమూల గ్రామంలోని పేదవాడికి ఒకటో తేదీన తెల్లవారుజామునే పింఛను డబ్బులను ఇవ్వడంలో సాంకేతికత కీలకంగా పనిచేస్తోంది. రైతు భరోసా కేంద్రాల్లో సాంకేతికత అమలు తీరు ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తోంది. ఆర్బీకేల్లో ఈక్రాప్ నమోదు, యాంత్రీకరణ, ఉచిత పంటల బీమా ప్రక్రియను వేగవంతం చేయడంతో బాటు కియోస్క్ యంత్రాల ఏర్పాటుపై ఇటీవల నీతి అయోగ్, యూఎన్‌డీపీలు ప్రశంసించాయి. అగ్రి ల్యాబ్‌ల ద్వారా విత్తనాలు, ఎరువులు నాణ్యతను సరిచూసుకోవచ్చు. పశువుల పేడ, రక్తం, మూత్రం పాలు, చర్మ కణాలు, నాజిల్ స్వాబ్‌లను పరీక్షించే వీలు కలుగుతుంది. పాలనా వ్యవస్థలతో పాటు ఉద్యానం, వాణిజ్యం, విద్య, ఆరోగ్యం ఇలా అన్ని వ్యవస్థలను సాంకేతికతతో ప్రభుత్వం ఒక గొడుగు కిందికి తీసుకొచ్చింది.

సజావుగా సంక్షేమం..

ప్రభుత్వ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.37,500 విలువైన ట్యాబ్‌ను ఉచితంగా అందజేసి విద్యారంగంలో సాంకేతిక విప్లవానికి ప్రభుత్వం అడుగు వేసింది. వారు 10వ తరగతిలోకి వచ్చే వరకూ బైజూస్ కంటెంట్‌తో పాఠాలను వింటారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థుల్లో నైపుణ్య సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో వారి చదువుకు సంబంధించిన సంస్థలకు సాంకేతిక యాప్‌తో అనుసంధానం చేసి ఆరు నెలల పాటు అనుభవ పూర్వక విజ్ఞానం పొందేందుకు ఇంటర్న్‌షిప్ చేయిస్తుంది. జిల్లాలో 48 డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు కోసం నూతన భవనాల నిర్మాణం కొనసాగుతోంది. మహిళలు, బాలల రక్షణే ధ్యేయంగా పూర్తి అధునాతన సాంకేతికతతో ప్రభుత్వం దేశంలోనే మొదటి సారిగా దిశ యాప్‌ను తీసుకురాగా లక్షలాది మంది ఆ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నారు. ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన సాంకేతికత వ్యవసాయ కార్యకలాపాలు సులభతరమయ్యాయి.

ధాన్యం సేకరణలోనూ..

రైతుల నుంచి ధాన్యంను కొనుగోలు చేయడమూ, సహకార సంఘాల సాయంతో ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించడమూ, రైతు ఖాతాకు చెల్లింపులు చేయడంలో సాంకేతికత గొప్ప పాత్ర పోషిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 906 గ్రామాల్లో భూ సమగ్ర సర్వేలో భాగంగా డ్రోన్‌ల ద్వారా 575 బృందాలతో సర్వే జరుగుతుంది. పూర్తి సాంకేతికతతో తొలివిడతలో 230 గ్రామాల్లో సర్వే పూర్తయింది. వేట నిషేధ సమయంలో తోడుగా నిలవాలన్న లక్ష్యంతో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంతో 2023–24 సంవత్సరానికి జిల్లాలో 9,821 మందిని లబ్ధిదారులను ఆన్‌లైన్ చేసింది.

ఆర్బీకేలతో పలు సేవలు

జిల్లాలో 455 ఆర్బీకేలతో రైతులకు పలు సేవలందుతున్నాయి. వాటిలోని 360 ఆర్బీకేల్లో కియోస్క్ యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. మిగిలిన 95 కేంద్రాలకు కియోస్క్ పరికరాల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వం నడుపుతున్న ఆర్బీకే చానల్‌ను గూగుల్ యాప్ ద్వారా వీక్షించే వీలు రైతులకు కల్పిస్తున్నాం. రైతుల కోసం మండలానికి ఒక ఆర్బీకేలో ఏటీఎంను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

– కె.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి, అమలాపురం

ట్యాబ్ వల్ల పాఠం చక్కగా అర్థమవుతోంది



నేను కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. 7వ తరగతి వరకూ ఉపాధ్యాయులు బోర్డుపై పాఠాలు చెప్పేవారు. 8వ తరగతిలో జగనన్న ప్రభుత్వం ట్యాబ్‌ను ఉచితంగా ఇచ్చింది. అందులో పాఠాలన్నీ ఉన్నాయి. తరగతి గదిలో ట్యాబ్‌లో పాఠాన్ని చూస్తూ ఉండగా టీచర్ ఆ పాఠాన్ని వివరిస్తున్నారు. ఈ కొత్తతరహా పద్ధతి వల్ల పాఠం చక్కగా అర్థమవుతోంది.

– తాతపూడి చరణ్‌తేజ్, తాతపూడి, కపిలేశ్వరపురం మండలం.

మాతా శిశు మరణాల రేటు తగ్గాలి

వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



మాతా శిశు మరణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: జిల్లాలో మాతా శిశు మరణాలు పూర్తిగా తగ్గించాలని...ఇందు కోసం స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా మాతా శిశు మరణాల సర్వే సమీక్షా సమావేశంలో కలెక్టర్ శుక్లా మాట్లాడారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని గర్భిణులను గుర్తించి వారు గర్భం దాల్చినప్పటి నుంచే నమోదు చేసుకుని రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేస్తూ అప్రమత్తతతో పర్యవేక్షించాలని సూచించారు. గర్భిణుల్లో రక్త హీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను గుర్తిస్తూ అందుకు అనుగుణంగా నిరంతర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో గత నాలుగు మాసాల్లో సంభవించిన రెండు శిశు మరణాలు, రెండు మాతృ మరణాలపై వైద్యాధికారులతో కలెక్టర్ శుక్లా సమీక్షించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జీవీ సత్యవాణి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి సమీక్షలో పాల్గొన్నారు. జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, కమ్యూనిటీ ఆస్పత్రుల, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసం

- 53 మంది నుంచి రూ.50 లక్షలకు టోకరా
- ఫేక్ వీసాలు ఇచ్చాడని బాధితుల ఆరోపణ


కాట్రేనికోనలో పోలీసు స్టేషన్ వద్ద గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయిన బాధితులు

కాట్రేనికోన: ఉభయ గోదావరి జిల్లా పరిధిలోని పలు గ్రామాలకు చెందినవారు గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయారు. తణుకు, కాట్రేనికోన మండలం పెనుమల్లే గ్రామానికి చెందిన బడుగు రాంబాబు, ముమ్మిడివరం మండలం కొత్తలంక శివారు బూరుగుపేటకు చెందిన మట్టా రాహుల్.. ర్యాలి గ్రామానికి చెందిన కాకి అర్జునరావుకు చెన్నైలో గల్ఫ్ ఏజెంట్లుగా పరిచయం చేసుకున్నారు. దుబాయ్‌లో షాపింగ్ మాల్స్‌లో సూపర్ వైజర్స్, సేల్స్ మెన్ వంటి అధిక జీతం వచ్చే ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. అర్జునరావు తనతోపాటు 52 మంది దుబాయ్ వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కొక్కరు ముందు రూ.80 చొప్పున చెల్లించేందుకు, రూ.20 వేలు విమాన టిక్కెట్ ఇచ్చే ముందు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. గత నెల 28 నాటికి మూడు విడతలుగా రూ.80 వేలు చొప్పున సుమారు రూ.50 లక్షలు చెల్లించామన్నారు. దుబాయ్ వెళ్లేందుకు నకిలీ వీసాలు ఇవ్వడంతో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో తిండీతిప్పలు లేకుండా పడిగాపులు కాశామన్నారు. ఏజెంట్ బడుగు రాంబాబు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయామని గుర్తించి ఈ నెల 7న ఇంటికి తిరిగి వచ్చేశామన్నారు. గల్ఫ్ ఏజెంట్ల మోసంపై బాధితులు వి.వరప్రసాద్, రవితేజ, నాగరాజు, రాజేష్, ప్రసాద్, పద్మరాజ్, రవికుమార్, సత్యనారాయణ ఈ నెల 8న స్పందనలోను, జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ వారిని పిలిపించి విచారించారు. ఎక్కువ మంది బాధితులు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఉన్నందున అక్కడి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని వారికి సూచించారు.

నూక శాతాన్ని పరిశీలించిన ఉన్నతాధికారి

నల్లజర్ల: రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో నూక శాతం ఎక్కువగా వస్తోందంటున్న మిల్లర్ల ఆరోపణలను స్వయంగా పరిశీలించేందుకు పౌరసరఫరాల శాఖ స్పెషల్ కమిషనర్ అరుణకుమార్ మండలంలోని ప్రకాశరావుపాలెం రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. వచ్చిన ధాన్యం శాంపిల్స్‌లో ఒక దానిని మెషీన్‌లో వేసి స్వయంగా పరిశీలించారు. 40 శాతం నూక వచ్చినట్టు గుర్తించారు. ఇలా ఎందుకు వస్తోందని వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. ధాన్యం వర్షంలో తడవడం ఒక కారణమైతే, ఎండ వేడిమి కూడా మరో కారణమని వారు వివరించారు.

సప్లిమెంటరీ కసరత్తులు

- పది, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఆదేశాలు జారీచేసిన పాఠశాల, మాధ్యమిక విద్యాశాఖలు
- ఇంటర్‌లో 23,583, పదిలో 20,438 మంది ఫెయిలైన విద్యార్థులు


రాయవరంలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రత్యేక తరగతులు

రాయవరం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పాస్ కాని వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు అటు పాఠశాల విద్యాశాఖ, ఇటు మాధ్యమిక విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఫెయిలైన విద్యార్థులను గట్టెక్కించేందుకు పునశ్చరణ తరగతులకు శ్రీకారం చుట్టారు.

23,583 మంది విద్యార్థులు ఫెయిల్

గత నెల 26న ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 42,137 మంది హాజరవ్వగా, 17,251 మంది ఫెయిలయ్యారు. ఫస్టియర్‌లో 59శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌కు 36,833 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6,332 మంది ఫెయిల్ కాగా, 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు మూడు వారాల శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేశారు. పరీక్ష ముందు రోజు వరకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ కాలేజీలు, హైస్కూల్ ప్లస్ స్కూల్స్, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీరందరికీ ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఫస్టియర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

'పది' విద్యార్థులకు సైతం

పదో తరగతి పరీక్షల ఫలితాలు ఈ నెల 6న విడుదలయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 68,759 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5,021, తూర్పుగోదావరి జిల్లాలో 6,667, కాకినాడ జిల్లాలో 8,750 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. వివిధ సబ్జెక్టుల్లో వీరు ఫెయిలయ్యారు. పరీక్షల ఫలితాల రోజునే ప్రభుత్వ పరీక్షల విభాగం సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. వచ్చే నెల 2 నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. **ఆయా సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు తిరిగి రాసేందుకు పరీక్ష ఫీజుల షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి** మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నారు.

పరీక్షలు పూర్తయ్యే వరకు

పది సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫెయిలైన విద్యార్థులకు స్పెషల్ సమ్మర్ కోర్సులు తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంది. ఇందుకుగాను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రతి రోజు సబ్జెక్టుల వారీగా, పీరియడ్ల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంది. ఆయా సబ్జెక్టుల వారీగా ఫెయిలైన విద్యార్థుల జాబితా తయారు చేసి, విద్యార్థులను మోటివేట్ చేసి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. గణితం, సైన్స్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల విషయంలో మరింత ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ప్రతి రోజు టెస్టులు నిర్వహించాలి. పూర్వం జరిగిన పబ్లిక్ పరీక్షల పేపర్లలోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయించాలి. పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక సమ్మర్ క్యాంపులను డీవైఈఓలు, ఎంఈఓలు ప్రతిరోజు విజిట్ చేసి, పర్యవేక్షణ చేయాలి. విద్యార్థులను మోటివేట్ చేయాల్సి ఉంది.

పది పరీక్షల షెడ్యూల్

తేదీ	పరీక్ష
జూన్ 2	తెలుగు/కాంపోజిట్ కోర్సు
జూన్ 3	హిందీ
జూన్ 5	ఇంగ్లిషు
జూన్ 6	గణితం
జూన్ 7	సైన్స్
జూన్ 8	సోషల్
జూన్ 9	ఓఎస్‌ఎస్‌సీ పేపరు-1
జూన్ 10	ఓఎస్‌ఎస్‌సీ పేపరు-2

ఇంటర్ పరీక్షల షెడ్యూల్

మే 24	సెకండ్ లాంగ్వేజ్
మే 25	ఇంగ్లిష్
మే 26	గణితం1ఎ, బోటనీ, సివిక్స్
మే 27	గణితం1బి, జువాలజీ, హిస్టరీ
మే 29	ఫిజిక్స్, ఎకనామిక్స్
మే 30	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్స్ ఆర్ట్స్, మ్యూజిక్
మే 31	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు గణితం
జూన్ 1	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

తరగతులు నిర్వహిస్తున్నాం


ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల ప్రకారం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఫెయిలైన విద్యార్థులు తిరిగి ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా సబ్జెక్టుల్లో తర్ఫీదునిస్తున్నాం.

– ఎస్‌పీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈవో, ఇంటర్మీడియెట్ బోర్డు, అమలాపురం.

ప్రణాళిక ప్రకారం తర్ఫీదు


పది పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలను జారీ చేశాం. ప్రతి విద్యార్థి పరీక్షల్లో తిరిగి ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం తర్ఫీదునివ్వాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి


పదవ తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు పంపించే విధంగా శ్రద్ధ తీసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

సై .. సై .. జోడెడ్లబండి


ఎడ్లబండిపై ప్రయాణిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే

రాజానగరం: సై .. సై .. జోడెడ్ల బండి .. అంటూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, హోం మంత్రి తానేటి వనిత, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, తదితరులు ఎడ్ల బండిపై హుషారుగా ప్రయాణం చేశారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మించిన రైతు బజారు ప్రారంభోత్సవానికి వచ్చిన వీరికి రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ స్వాగతం పలుకుతూ ప్రత్యేకంగా ఎడ్లబండిని ఏర్పాటు చేసింది. దానిపై లాలాచెరువు జంక్షన్ నుంచి హెచ్‌బీ కాలనీలోని రైతుబజారు వరకు జాతీయ రహదారిపై ఈ విధంగా వారు ప్రయాణించారు. సాధారణంగా ఎడ్ల బండ్లపై కేరింతలు కొడుతూ, హుషారుగా సంక్రాంతి సంబరాలలో ప్రయాణిస్తుంటారు. ఈ విధంగా రైతుబజారు ప్రారంభోత్సవానికి వచ్చిన నాయకులు పండగ శోభను తీసుకువచ్చారు.

పాలనా భాషగా తెలుగు అమలు కావాలి

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



రాజమహేంద్రవరం సిటీ: ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలుగుభాష చేరువయ్యే విధంగా రాష్ట్ర పాలనలో వివిధ విభాగాల్లో తెలుగు భాష అమలు జరిగేలా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పరిపాలనా కార్యక్రమాల్లో తెలు గు భాష అమలు చేయడంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సరళమైన, వాడుక భాషలోనే ప్రత్యుత్తరాలు జరపడం సామాజిక బాధ్యతగా చేపట్టాల్సి ఉందన్నారు. మౌఖిక భాషను పాల నా భాషగా అమలు చేయడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని కోరారు. తెలుగు భాషా వికాసానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికార భాషా సంఘం అధ్యక్షుడి నియామకం చేపట్టడం ఇందుకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో తెలుగుభాషా ప్రభావాన్ని సంస్కృతిని ప్రతిబింబించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రాజమహేంద్రవరం అమ్మలాంటిది

తొలిసారిగా తిరుపతిలో అధికారులతో సమావేశం నిర్వహించి, రెండో సమావేశం తూర్పుగోదావరిలో నిర్వహిస్తున్నట్లు విజయబాబు తెలిపారు. రాజమహేంద్రవరం తెలుగు భాషకు అమ్మలాంటిదన్నారు. అధికార భాష అమలులో భాగంగా 1988 ప్రభుత్వం తెలుగు అమలు కోసం రూపొందించిన పలు ఉత్తర్వులను పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, న్యాయస్థానాల ద్వారా వచ్చే తీర్పులు తెలుగులో ముద్రించి ఇచ్చే అవకాశం కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వెళ్లి విన్నవిస్తానన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల విషయంలో నూరు శాతం తెలుగు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

రూ.కోటితో సప్తగోదావరి అభివృద్ధి: మంత్రి వేణు


అభివృద్ధి పనులకు అనువుగా ఎండబెట్టిన సప్తగోదావరి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న శ్రీ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి అభివృద్ధికి ప్రభుత్వం దేవదాయ శాఖ నుంచి సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులు రూ.1 కోటి మంజూరు చేసినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం ద్రాక్షారామ భీమేశ్వరాలయం అన్నారు. ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరి జలాలతో స్వామికి తొలి అభిషేకం చేస్తారని, భక్తులు సప్త గోదావరిలో స్నానమాచరించి స్వామి దర్శనానికి వెళ్లడానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సప్త గోదావరిని శుద్ధ జలాలతో ఉండే విధంగా అభివృద్ధి చేయడానికి సంకల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) మాట్లాడు తూ సప్త గోదావరికి పురాణ ప్రాశస్త్యం ఉందని చెప్పారు. సప్తరుషులు స్వామివారి సన్నిధిలో కోనేరు ఉండాలన్న సంకల్పంతో గోదావరి మాతను ప్రార్థించి అంతర్ వాహినిగా ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చారని తెలిపారు. సప్త గోదావరిని అభివృద్ధి చేయాలనేది భక్తుల చిరకాల కోరిక అని, మంత్రి వేణుగోపాలకృష్ణ కృషితో ఇన్నాళ్లకు నెరవేరుతోందని అన్నారు.

పెళ్లింట విషాదం

కుమార్తె వివాహం కోసం కర్ర నరుకుతుండగా విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి


వెంకటేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గోకవరం: మరికొద్ది రోజుల్లో ఆ ఇంట్లో వివాహం జరగబోతోంది. కుమార్తె వివాహ పనుల్లో భాగంగా పందిరి రాట వేసేందుకు కర్ర నరుకుతుండగా హైటెన్షన్ విద్యుత్ వైరుపై పడి విద్యుతాఘాతానికి గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దుర్ఘటనతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. గోకవరం మండలం వెదురుపాకకు చెందిన చెనుబోయిన వెంకటేష్ (42) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అతనికి భార్య లోవమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వీరదుర్గకు ఈ నెల 20వ తేదీన వివాహం నిశ్చయించారు. 17న ఇంటి ఆవరణలో పందిరి రాట వేసేందుకు భార్యాభర్తలు ఇద్దరూ కలిసి బుధవారం బావాజీపేట శివారున ఉన్న పోలవరం కాలువ గట్టు వద్దకు వెళ్లారు. కర్రలు నరుకుతుండగా ఒక కర్ర 220 కేవీ హైటెన్షన్ వైరుపై పడి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో ఆమె షాక్‌కు గురైంది. కుమార్తెలు సంఘటన స్థలానికి చేరుకుని తండ్రి మృతదేహం వద్ద బోరున విలపించారు. మృతదేహాన్ని పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.